క్లుప్తంగా

ప్రత్తిపాడు సీఐగా శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సీఐగా జి.శ్రీనివాసరావును నియమిస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన నిసార్‌బాషాను ఉన్నతాధికారులు గతంలో సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒంగోలు పీటీసీలో సీఐగా చేస్తున్న గన్నవరపు శ్రీనివాసరావును ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. త్వరలో ఆయన ఇక్కడ విధుల్లో చేరనున్నారు.

వేజండ్ల పీఏసీఎస్‌లో త్వరలో ఎరువుల అమ్మకాలు

వేజండ్ల(చేబ్రోలు): వేజండ్ల వ్యవసాయ సహకార పరపతి సంఘంలో త్వరలో రైతులకు ఎరువులు విక్రయించనున్నట్లు పీఏసీఎస్ అఫీషియల్ పీఐసీ ఎస్.భవన్నారాయణ రాజు తెలిపారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలోని పీఏసీఎస్‌లో గురువారం ఆయన మాట్లాడారు. కొద్దిరోజుల్లో వేజండ్ల పీఏసీఎస్‌లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ఎరువులు అమ్మనున్నట్టు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 2 నుంచి పీఏసీఎస్ సేవలను ఆన్‌లైన్ చేయడానికి కృషి చేస్తోందని, దీనిలో భాగంగా కంప్యూటరీకరణ వేగంగా జరుగుతుందని వివరించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో అర్హులైన రైతులందరికీ పంట రుణాలు, వ్యవసాయ అనుబంధ రుణాలు అందజేస్తున్నట్లు భవన్నారాయణ రాజు తెలిపారు.

నేటి నుంచి పాఠ్యాంశాల బోధనపై పరిశీలన



ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను ఉన్నతాధికారులు శుక్రవారం నుంచి పరిశీలించనున్నారు. దీనికోసం మండలంలో కొంత మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఇటీవలే టీచింగ్ టూల్ యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులకు గురువారం స్థానిక మండల విద్యావనరుల కార్యాలయంలో ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, జి. లీలారాణి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, సీఆర్పీలు వారంలో రెండు రోజులు వారికి కేటాయించిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు చెబుతున్న తీరును పరిశీలించి, వివరాలను టీచింగ్ టూల్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బ్రాడీపేట 2వ లైనులో నివాసం ఉండే ఏడిద విజయ్ (23) అరండల్‌పేటలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తుంటాడు. భార్య దేవితో గత కొంతకాలంగా వివాదం జరుగుతున్న నేపథ్యంలో ఆమె పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన విజయ్ బ్రాడీపేటలోని తన నివాసంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిని మోసం చేసి భూమిని విక్రయించిన వారిపై కేసు

పట్నంబజారు: వ్యక్తిని మోసం చేసి భూమి విక్రయించిన పలువురిపై కేసు నమోదైంది. పట్టాభిపురం ఎస్ఐ మధుపవన్ తెలిపిన వివరాల ప్రకారం గుజ్జనగుండ్లలో నివాసం ఉండే పెంట్యాల భూషయ్య తన రెండు ఎకరాల భూమిని దేవరశెట్టి కిరణ్, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, కృష్ణారావులకు ఉమ్మడి రిజిస్ట్రేషన్ చేసి రూ.1,22,80,000 అప్పుగా తీసుకున్నారు. అయితే పెంట్యాల భూషయ్యకు తెలియకుండా నలుగురు వ్యక్తులు కలిసి రెండు ఎకరాల భూమిని రూ. 5.80 కోట్లకు విక్రయించారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యానాదుల సమస్యలు పరిష్కరించాలి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో యానాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బహుజన మహాసభ కేంద్ర కమిటీ కార్యదర్శి జి.ఆర్.భగత్ సింగ్ విన్నవించారు. ఈ మేరకు గురువారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులును ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యానాదులు ఉండటానికి ఇళ్ల స్థలాలు లేవని, నీళ్లు, కరెంటు సమస్యలు వీరిని వెంటాడుతున్నాయని, వారి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జూపూడి శ్రీనివాసరావు, పలుకూరి ప్రసాదరావు, షేక్ సల్మా, షేక్ సైదా, మణికల నరసయ్య, చెంచమ్మ తదితరులు ఉన్నారు.





నేలతల్లికి సంబరమేఘా

సాగునీరు అందక నెర్రలిచ్చిన భూములు ఆకాశమ్మ వైపు అర్రులు చాచాయో ఏమో.. అన్నదాతల ఆర్తనాదాలు గగనతలాన్ని తాకాయో ఏమో.. ఢమఢమలాడుతూ నీలిమేఘాలు నింగిని కమ్మేశాయి. మెరుపులీనుతూ రైతన్న మోముల్లో సంబరమల్లె తళతళలాడాయి. చిరుజల్లులతో నేలతల్లిని అభిషేకించేందుకు సిద్ధమయ్యాయి. గురువారం సాయంత్రం ప్రత్తిపాడులో ఇలా కరిమేఘాలు కనువిందు చేశాయి. – ప్రత్తిపాడు:

మద్యానికి బానిసై.. దొంగలుగా మారారు

నలుగురు మోటార్, ఐరన్ దొంగలు అరెస్టు

ప్రత్తిపాడు: ఆ నలుగురూ స్నేహితులు మద్యానికి బానిసయ్యారు. వ్యసనాలకు డబ్బుల్లేక దొంగతనాలకు పాల్పడుతూ చివరికి కటకటాలపాలయ్యారు. పోలీస్ స్టేషనులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ నాగేంద్ర కేసు వివరాలను వెల్లడించారు. గుంటూరు రూరల్ మండలం దాసరిపాలెం ప్లాట్స్‌కు చెందిన షేక్ మస్తాన్, కగ్గ ఏడుకొండలు, అంబల నరేంద్ర, దొండపాటి ప్రశాంత్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో వీరి మధ్య స్నేహం ఏర్పడింది. నలుగురూ మద్యానికి అలవాటుపడ్డారు. తాగేందుకు, వ్యసనాలకు డబ్బులు లేకపోవడంతో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 20న గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం ఈదులపాలెం సమీపంలోని పదహారో నంబరు జాతీయ రహదారి వెంబడి ఉన్న వైష్ణవి టౌన్ షిప్ వెంచర్‌లో నీటి మోటార్‌తో పాటు ఇనుప రాడ్లను దొంగిలించారు. దీంతో వెంచర్ సూపర్‌వైజర్ తలశిల మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన పోలీసులు గురువారం నడింపాలెం హైవేపై అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిని తమదైన శైలిలో ప్రశ్నించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి ఒక నీటి మోటార్‌తో పాటు ఏడు ఇనుప రాడ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి గుంటూరులోని 6వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.



అరెస్టు చేసిన నలుగురు నిందితులతో ఎస్ఐ నాగేంద్ర, కానిస్టేబుళ్లు

ధ్యేయ'మొక్క'టే పర్యావరణ పరిరక్షణ



వంగిపురంలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ శిఖా విజయలక్ష్మి



కాకుమాను జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రత్తిపాడు/కాకుమాను: పర్యావరణ పరిరక్షణే ప్లాంట్ ఫర్ మదర్ ధ్యేయమని సర్పంచ్ శిఖా విజయలక్ష్మి చెప్పారు. వంగిపురంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఆధ్వర్యంలో 'ప్లాంట్ ఫర్ మదర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి ఏపీఓ మస్తాన్‌వలి నేతృత్వంలో గ్రామ సర్పంచ్ శిఖా విజయలక్ష్మి స్థానిక రక్షిత మంచి నీటి చెరువు గట్టుపై మొక్కలు నాటారు.

– కాకుమాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

పొన్నూరు: సినీ నటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరంలో ముఖ్య అతిథిగా జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు పాల్గొని ప్రారంభించారు. చిరంజీవి అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు ఆకుల సాంబశివరావు, తోట ప్రసాద్, జనసేన నాయకులు వీర మహిళ అరుణ, యరసాని నాగభూషణం, కరిముల్లా, సుబ్బారావు, ఎలవర్తి వెంకటేశ్వర్లు, సింగంశెట్టి శంకర్, పవన్, రాధా రంగా మిత్రమండలి అధ్యక్షులు యన్నం నాయుడు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్ అందిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు వాటర్‌ప్లాంట్‌పై రగడ

గ్రామ పాలకవర్గ సమావేశంలో అధికారులను ప్రశ్నించిన వార్డుసభ్యులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు వాటర్ ప్లాంట్ విషయమై వార్డు సభ్యులు పంచాయతీ అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రత్తిపాడులోని పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ సర్పంచ్ వసువర్తి రమాదేవి అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గ సమావేశం జరిగింది. వార్డు సభ్యులు స్థానిక రక్షిత మంచినీటి చెరువు కట్టపై ఉన్న వాటర్ ప్లాంట్‌కు అనుమతులు ఉన్నాయా? లేవా? ఉంటే ఎప్పటివరకు ఉన్నాయి? పూర్తయితే ఎందుకు పంచాయతీ స్వాధీనం చేసుకోవడం లేదంటూ ప్రశ్నలు సంధించారు. ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి కలుగజేసుకుని ప్లాంట్ అనుమతులు పూర్తయిన నాటి నుంచి పంచాయతీ తరపున ఏమైనా బిల్లు రూపంలో ప్లాంట్ నిర్వాహకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారా అని కార్యదర్శిని అడిగారు. అలాంటిదేమీ లేదని కార్యదర్శి చెప్పడంతో, మరి బిల్లుల రూపంలో కాకుండా మీ జేబుల్లోకి ఏమైనా వెళ్లాయా? అని సూటిగా ప్రశ్నించారు. వెళ్లలేదనుకుంటే ప్లాంటు లెక్కలు, వివరాలు చెప్పి, ప్లాంట్‌కు వేలం పాట పెట్టవచ్చు కదా అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వార్డుసభ్యులకు, పంచాయతీ అధికారులకు మధ్య వాగ్వాదం జరిగింది. స్పందించిన కార్యదర్శి సాయంత్రంలోపల వాటర్ ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులిచ్చి వివరణ తీసుకుంటామని చెప్పడంతో సభ్యులు శాంతించారు. పంచాయతీ గుమస్తా కోటేశ్వరరావుపై ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి ఫైర్ అయ్యారు. వివిధ పనుల నిమిత్తం పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజల నుంచి డిమాండ్ చేసి మరీ డబ్బులు తీసుకోవడం ఏమిటని మండిపడ్డారు. సమావేశంలో వార్డుసభ్యులు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో వాటర్ ప్లాంట్ విషయమై అధికారులను ప్రశ్నిస్తున్న వార్డుసభ్యులు

మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం అందించాలి

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాతదేవి

ప్రత్తిపాడు: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మధ్యాహ్న భోజనం అందించాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి.సుజాతదేవి చెప్పారు. ప్రత్తిపాడులోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు సమీక్ష నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. చిన్నారుల బరువులను కొలచి ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న సీడీపీఓ సుజాతదేవి

పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి



పెదకాకాని: పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై.నేతాజీ డిమాండ్‌చేశారు. వెనిగండ్ల పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ సెప్టెంబరు 10న రాష్ట్ర సదస్సు జరుగుతుందని, సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలి



బోడిపాలెం(కాకుమాను): ఖరీఫ్ సీజన్‌లో సేద్యం ప్రారంభించిన రైతులందరూ ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ కె.కిరణ్మయి చెప్పారు. బోడిపాలెం, కోతివానిపాలెం గ్రామాలలో గురువారం ఈ–క్రాప్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధికి ఈ–క్రాప్ తప్పనిసరని చెప్పారు. వరి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె.సౌమ్య పాల్గొన్నారు.

వ్యర్థాలతో వ్యాధులు

ప్రత్తిపాడు: వ్యర్థాల వలన ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారని వాటర్ ఎయిడ్ సంస్థ గుంటూరు జిల్లా కో–ఆర్డినేటర్ సురేష్ చెప్పారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నీటి నాణ్యతతోపాటు నీటి శుద్ధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. సురేష్ మాట్లాడుతూ సూచనలు, సలహాలు అందించారు. అడ్మిన్ ఆఫీసర్ సాయి మాట్లాడుతూ ఆరోగ్యహిత గ్రామాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

జీఎస్టీ కార్యాలయంలో కంటి వైద్య పరీక్షలు

లక్ష్మీపురం: కళ్ల సమస్యలను అశ్రద్ధ చేయవద్దని సెంట్రల్ జి.ఎస్.టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. స్థానిక కన్నవారితోటలోని సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్ కార్యాలయంలో గురువారం కమిషనర్ సాధు నరసింహారెడ్డి కంటి ఆరోగ్య వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి వైద్య పరీక్షలకు ముందుకు వచ్చిన వాసన్ ఐ కేర్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

సాగునీరు లేక పైర్లు ఎండుముఖం

ఎమ్మెల్యే బూర్ల ఎదుట రైతుల ఆవేదన

ప్రత్తిపాడు: సాగునీరు లేక పైర్లు ఎండిపోతున్నాయని రైతులు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వట్టిచెరుకూరు మండలం గారపాడులో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బూర్ల పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వర్షాల్లేక, గుంటూరు చానల్ ద్వారా సాగు నీరు అందక పంటలు దెబ్బతింటున్నాయని, భూములు నెర్రలిస్తున్నాయని పేర్కొన్నారు. కాలువలను విస్తరిస్తేగానీ పొలాలకు నీరు అందే పరిస్థితులు లేవని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన బూర్ల రామాంజనేయులు గారపాడులోని గుంటూరు చానల్‌ను పరిశీలించారు. నీరు తక్కువగా ఉండటంతో రైతులకు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గుంటూరు చానెల్‌ను పొడిగిస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామన్నారు. గుంటూరు చానల్ ఆధునికీకరణకు రూ.626 కోట్లు కేటాయిస్తామని మంత్రి లోకేష్ చెప్పిన విషయాన్ని బూర్ల రైతులకు గుర్తు చేశారు.



గారపాడులో గుంటూరు చానల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రతి గ్రామానికీ సురక్షిత తాగునీరు

బోడిపాలెం(కాకుమాను): గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చెప్పారు. మండలంలోని బోడిపాలెంలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా నిర్మించనున్న వాటర్ ప్లాంట్ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ ప్లాంటుకు రూ.52.5 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కళ్యాణ్ చక్రవర్తి, డీఈ అనీల్ కుమార్, ఏఈ రమేష్, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ పి.రామకృష్ణ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేయండి

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ ఇంటూరి పద్మావతి

గుంటూరు రూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేయాలని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి తెలిపారు. గురువారం నగరంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలోఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నందున అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణలో తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ఎంపీడీఓ ఆదినారాయణ మాట్లాడుతూ శుక్రవారం గ్రామసభలను జయప్రదం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దర్శి సుజాత, ఎంపీటీసీ సభ్యులు ఉడతా భూలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడు కరిముల్లా, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

గ్రామ సభలను జయప్రదం చేద్దాం

సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి

ప్రత్తిపాడు: గ్రామ సభలను జయప్రదం చేద్దామమని సమగ్ర శిక్ష ఏపీసీ, మండల ప్రత్యేకాధికారి జి.విజయలక్ష్మి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జి ఎంపీడీవో రామకోటయ్య అధ్యక్షతన గ్రామసభల నిర్వహణకు నియమించిన ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఏపీసీ సమావేశమయ్యారు. గ్రామ సభల నిర్వహణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కుర్చీలన్నీ పరిచేయొద్దని, ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చేలా చేయొద్దని చెప్పారు. సభల వద్ద అనెగ్జర్–1, 2లను ప్రదర్శించాలన్నారు. అర్జీల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రామసభ వివరాలను ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా రూపొందించిన గ్రామసభ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా గ్రామ సభల అజెండాను వివరించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన..

కోయవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి నాణ్యతపై ఏజెన్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల అటెండెన్స్ రిజిస్టర్లు చూసి, 81 మంది విద్యార్థులకు 25 మంది గైర్హాజరవ్వడంపై ఉపాధ్యాయులను ప్రశ్నించారు.



గ్రామసభల నిర్వహణపై మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి

గ్రామసభలను పకడ్బందీగా నిర్వహించాలి.

పొన్నూరు: గ్రామాల్లో శుక్రవారం జరిగే గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసరావు ఆదేశించారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సభల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఇదేమి పారి'చోద్యం'!

పొన్నూరు పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ప్రధాన ప్రాంతాలతోపాటు వీధులు, రహదారులు చెత్త, వ్యర్థాలతో నిండిపోతున్నాయి. వీటిని తొలగించే పనులు సవ్యంగా సాగడం లేదు. ఫలితంగా కొన్ని ప్రాంతాల్లో వారాల తరబడి చెత్త పేరుకుపోతోంది. దీంతో దోమల బెడద, దుర్గంధంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద కనిపించిన ఈ దృశ్యాలు అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. – పొన్నూరు





డాక్యుమెంట్స్ పోయినవి

నా క్లయింటు శ్రీ ఉయ్యూరు ప్రకాశరెడ్డి S/o. బాపిరెడ్డి, మంగళగిరి వారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా నా క్లయింటు జూన్ నెల 15వ తేదీ 1976లో మంగళగిరి సబ్ రిజిస్ట్రారు ఆఫీసు నందు రిజిష్టర్ చేయించుకున్న ఒరిజినల్ దస్తావేజు నెం. 2088/1976 మరియు లింకు దస్తావేజులు ది. 01-08-2024వ తేదీన పెదకాకాని రిజిష్టర్ ఆఫీసు వద్ద జిరాక్స్ కోసం తీసుకుని వెళ్ళుతుండగా మార్గమధ్యంలో ఎక్కడో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన వారు ఈ దిగువ ఫోన్ నెంబర్ ను సంప్రదించి అందజేయగలరు. సెల్: 94923 73855.

అభ్యుదయ మహిళా కళాశాలలో కామర్స్ ఫెస్ట్–2024

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నతస్థానానికి చేరుకునేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ఎంతో అవసరమని అమెరికాకు చెందిన డేటా ఎనలిస్ట్ ఇక్కుర్తి వెంకట్ పేర్కొన్నారు. లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో గురువారం కామర్స్ ఫెస్ట్–2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవడంతో పాటు జీవితాన్ని సక్రమంగా గడిపేందుకు కీలకమైన ఏడు సూత్రాలను గురించి వివరించారు. భారతీ సోప్‌వర్క్స్ ఎండీ దివ్యభారతి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామివేత్తలుగా రాణించేందుకు, కంపెనీ నిర్వహణకు సంబంధించిన మార్గాలను వివరించారు. నందమూరి దీప్తి మాట్లాడుతూ స్థిరమైన లక్ష్యం ఏర్పరచుకుని స్పష్టమైన అవగాహనతో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల బీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ బి. రోహిణిదేవి, కామర్స్ ఫెస్ట్ సమన్వయకర్త ఆర్. అర్జున్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.